# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 05 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఎన్‌కౌంటర్‌లో 18కు చేరిన మృతుల సంఖ్య

- గురువారం ఉదయం గాలింపు చర్యలు ప్రారంభం
- మరో ఆరు మృతదేహాలు గుర్తించిన భద్రతాదళాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్%-%దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో బుధవారం మావోయిస్టులు%-%భద్రతా దళాల మధ్య జరిగిన తీవ్ర ఎదురు కాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టుల సంఖ్య 18కు చేరింది. బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు, ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

సాయంత్రం చీకటి కారణంగా ఆపిన గాలింపు చర్యలను భద్రతాదళాలు గురువారం ఉదయం మళ్లీ ప్రారంభించగా, ఘటనా స్థలంలో మరో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. సంబంధిత ప్రాంతంలో ఇంకా మావోయిస్టుల సంచారం ఉన్న అవకాశంతో భద్రతాదళాలు అదనపు బలగాలను మోహరించి గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి.

## ఆదిలాబాద్‌లో
# ఏడాదిలోపు విమానాశ్రయ పనులు



- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కట్టితీరుతాం
- పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత నాది
- త్వరలో 40 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్
- ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశమిస్తున్నాం
- రెండేండ్లుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు
- ఆదిలాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**బలగం టీవీ, ఆదిలాబాద్**

ఆదిలాబాద్ జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని ఏడాదిలోపు ప్రారంభిస్తాం అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వరంగల్‌తో పాటు ఆదిలాబాద్‌కూ అన్ని సౌకర్యాలతో కూడిన విమానాశ్రయం అవసరమని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు వల్ల జిల్లాకు పరిశ్రమలు, పెట్టుబడులు ఆకర్షితమవుతాయని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజా పాలన %-% ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలో రూ. 260.45 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు గారు, గడ్డం వివేక్ వెంకటస్వామి గారు, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి గారితో పాటు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**"ఎర్రబస్సే కాదు ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు కూడా"**

సీఎం మాట్లాడుతూ ఆదిలాబాద్ పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు."ఎర్రబస్సే కాదు ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు కూడా తీసుకొస్తాం" అని సీఎం పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి బాధ్యతను స్వయంగా తీసుకుంటానని హామీ ఇచ్చారు.

**ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కట్టితీరుతాం**

తమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని తప్పకుండా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి స్వయంగా హాజరవుతానని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న అపారమైన సున్నపు గనులను సద్వినియోగం చేసే చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. తుమ్మిడిహట్టి వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత %-% చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టి ఈ జిల్లా పంట పొలాలకు నీళ్లిస్తామన్నారు. త్వరలోనే ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి ఆదిలాబాద్ జిల్లాకు విశ్వవిద్యాలయం మంజూరు చేస్తామని ప్రకటించారు.

**ఇంద్రవెల్లిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి**

ఇంద్రవెల్లిని పర్యాటక కేంద్రంగా మలుస్తున్నట్టు సీఎం వెల్లడించారు. త్వరలో మళ్లీ ఆదిలాబాద్ పర్యటనకు వస్తానని, రోజంతా జిల్లాలోని సమస్యలపై ప్రత్యేక సమీక్ష చేపడతానని చెప్పారు. "ఆదిలాబాద్‌లో తప్పకుండా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం" అని సీఎం స్పష్టం చేశారు. వర్సిటీ ఎక్కడ నిర్మించాలన్నది స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి నిర్ణయించుకోవాలని సూచించారు. తన వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం ఇంద్రవెల్లిలో కడితే అనుకూలం అని అభిప్రాయపడ్డారు. దానికి కొమురం భీం విశ్వవిద్యాలయంగా నామకరణం చేస్తే మరింత బాగుంటుందని సూచించారు.

**ఉద్యోగాల భర్తీ వేగవంతం**

గత ఏడాదిలో 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్టు తెలిపారు. త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్టు ప్రకటించారు. "మన యువత ఐఏఎస్, ఐపీఎస్‌లు అవుతేనే నాకు నిజమైన సంతోషం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం తిరిగే లోపు 61 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేశాం. ప్రజా పాలన %-% ప్రజా విజయోత్సవ సంబరాలు ముగిన తర్వాత సమీక్ష నిర్వహించి మరో 40 వేల ఉద్యోగాల నియామకాల ప్రక్రియ చేపడుతాం. మొత్తంగా లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు. గతంలో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ మూత పడటం, జిల్లాలో సున్నపురాయి గనులను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రైవేటు పెట్టుబడుదారులను ఆహ్వానిస్తామన్నారు.

## 395 మంది సర్పంచ్‌లు ఏకగ్రీవం

- అత్యధికంగా వికారాబాద్‌లో 39 అత్యల్పంగా వనపర్తిలో 5
- 9,331 వార్డు స్థానాలు ఏకగ్రీవం
- అత్యధికంగా ఆదిలాబాద్‌లో 953, అత్యల్పంగా వికారాబాద్‌లో 652
- 13,127 మంది బరిలో
- 3,836 పంచాయతీ స్థానాల్లో ఎన్నికలు
- డిసెంబర్ 11న ఓటింగ్, అదే రోజు లెక్కింపు, ఫలితాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో మొదటి దశ పంచాయతీ ఎన్నికల్లో 395 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 189 మండలాల్లోని 4,236 పంచాయతీలు, 37,440 వార్డులకు మొదటి దశలో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల తుది వివరాలను ఎన్నికల సంఘం అధికారులు గురువారం వెల్లడించారు. అత్యధికంగా వికారాబాద్‌లో 39, ఆ తర్వాత ఆదిలాబాద్‌లో 33, నిజామాబాద్‌లో 29 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అత్యల్పంగా హన్మకొండ, జగిత్యాల, పెద్దపల్లిలో 4 చొప్పున, ఆ తర్వాత వనపర్తిలో 5 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయని ఎన్నికల సంఘం తెలిపింది. వార్డుల వారీగా మొదటి దశలో మొత్తం 37,440 వార్డుల్లో 9,331 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అత్యధికంగా ఆదిలాబాద్‌లో 953, ఆ తర్వాత వికారాబాద్‌లో 652, కొమురం భీం ఆసీఫాబాద్‌లో 576, అత్యల్పంగా జోగులాంబ గద్వాలలో 79, ఆ తర్వాత వనపర్తిలో 104, సంగారెడ్డిలో 113 వార్డులు ఏకగ్రీవమైనట్టు ఎన్నికల సంఘం పేర్కొంది. మొదటి దశలో మొత్తం 4,236 పంచాయతీల్లో 395 ఏకగ్రీవం కాగా 3,836 గ్రామాల్లో ఎన్నికలు జరగనున్నాయి. తుది లెక్కల ప్రకారం 8,095 మంది సర్పంచ్ పదవికి వేసిన నామినేషన్లను ఉపసంహరించుకోగా, 13,127 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. అలాగే మొత్తం 37,440 వార్డుల్లో 9,626 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా 67,893 బరిలో నిలిచారు. సర్పంచ్ పదవి కోసం

ఒక్కో స్థానానికి ముగ్గురు చొప్పున, వార్డులకు ఒక్కో స్థానానికి ఇద్దరు చొప్పున సగటున పోటీలో ఉన్నారు. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం తుది జాబితాను ప్రకటించి ఆల్ఫాబెటికల్ వారీగా ఎన్నికల గుర్తులను కేటాయించారు. ఇద్దరు ఒకే పేరుతో ఉంటే ఇంటి పేరు, వృత్తిని పరిగణనలోకి తీసుకుని రిటర్నింగ్ అధికారి గుర్తును కేటాయించారు. డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించి అదే రోజున మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటించనున్నారు. నేటితో రెండో విడుత నామినేషన్ల అప్పీళ్లతో పాటు మూడో విడుత నామినేషన్లకు గడువు ముగియనుంది.

రాష్ట్రంలో తొలి దశలో ఎన్నికలు జరుగుతున్న 4,236 పంచాయతీల్లో 5 గ్రామాలు ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలో 3, ఆసీఫాబాద్, నిర్మల్ జిల్లాలో ఒక్కో గ్రామంలో పోటీకి అభ్యర్థులెవరూ ముందుకు రాలేదు. అలాగే 37,440 వార్డులకు గాను 149 వార్డులో కూడా ఎవరూ పోటీకి ఆసక్తి చూపక పోవడంతో ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని ఈసీ తెలిపింది. అత్యధికంగా కుమురంభీం ఆసీపాబాద్ జిల్లాలో 41 వార్డుల్లో, ఆ తర్వాత మంచిర్యాల జిల్లాలో34 వార్డుల్లో నామినేషన్ వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు.

## 18,822 మందిని భారతీయులను అమెరికా బహిష్కరించింది

- 2025లో ఇప్పటివరకు 3,258 మంది భారతీయుల బహిష్కరణ
- కేంద్రం వెల్లడి



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి పదవిలోకి వచ్చిన తర్వాత వలసదారులపై కఠిన చర్యలు ప్రారంభమయ్యాయి. చట్టవ్యతిరేకంగా అమెరికాలో నివసిస్తున్న విదేశీయులను దేశం నుంచి పంపించడానికి ప్రభుత్వం వేగం పెంచింది. ప్రత్యేక చార్టర్ విమానాలు, వాణిజ్య విమానాల ద్వారా వేలాదిమందిని స్వదేశాలకు తరలిస్తోంది.రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వివరాలు వెల్లడించారు. 2025 జనవరి నుంచి ఇప్పటివరకు 3,258 మంది భారతీయులను అమెరికా బహిష్కరించిందని తెలిపారు.

జైశంకర్ వివరాల ప్రకారం, ఈ ఏడాది అమెరికా బహిష్కరించిన 3,258 మందిలో 2,032 మంది (62.3%) ను వాణిజ్య విమానాల్లో, 1,226 మంది (37.6%) ను యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏర్పాటు చేసిన ప్రత్యేక చార్టర్ విమానాల ద్వారా భారత్‌కు పంపించారు.

**సంవత్సరాల వారీగా బహిష్కరణల సంఖ్య**

2023లో: 617 మంది
2024లో: 1,368 మంది
2025 (ఇప్పటి వరకు): 3,258 మంది
2009–2025 మధ్య 18,822 మంది భారతీయుల పంపింపు

2009 నుంచి ఇప్పటి వరకూ మొత్తం 18,822 మంది భారతీయుల్ని అమెరికా వెనక్కి పంపించిందని జైశంకర్ వెల్లడించారు. అక్రమ వలసల నియంత్రణలో భాగంగా అమెరికా మరింత కఠిన వైఖరి అవలంభిస్తోంది. రానున్న నెలల్లో డిపోర్టేషన్ సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఢిల్లీలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

### పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష ఎంపీలో మాస్కులు ధరించి నిరసన




**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర రూపం దాల్చడంతో ఆ పొగ పార్లమెంట్‌నూ తాకింది. ఆ కాలుష్య నియంత్రణకు కేంద్రం తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. గురువారం పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష ఎంపీలు మాస్కులు ధరించి నిరసన తెలిపారు. ప్లకార్డులు చేతబూని నినాదాల హోరెత్తించారు. ఈ సమస్యను జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత సోనియా గాంధీ, రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంకా గాంధీ, సీపీఐ(ఎం) ఎంపీ కె. రాధాకృష్ణన్, జాన్ బ్రిట్టాస్, సీపీఐ ఎంపీలు పి.సంతోష్ కుమార్, సుబ్బరాయన్, డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సూలేతో పాటు అనేక మంది ప్రతిపక్ష ఎంపీలు గ్యాస్ మాస్కులు ధరించి నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోనియా గాంధీ మాట్లాడుతూ వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ఇది ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కాలుష్యంతో చిన్న పిల్లలు అనారోగ్యం బారిన పడి మృతి చెందుతున్నారని. పెద్దలూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాయు కాలుష్యం రాజకీయ అంశం కాదని ప్రియాంక గాంధీ అన్నారు. నెల రోజుల నుంచి తీవ్రమవుతున్న వాయు కాలుష్య సంక్షోభంపై చర్చించాలని ఉభయసభల్లో కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష ఎంపీలు వాయిదా తీర్మానం ఇచ్చారు. ఢిల్లీ వాయు కాలుష్యంపై చర్చకు ప్రతిపక్షాల డిమాండ్ మధ్య రాజ్యసభ ఒకసారి వాయిదా పడింది.

డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి పడిపోవడంపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. యూఎస్ డాలర్‌తో పోలిస్తే చరిత్రలో ఎన్నడూ లేనంతగా రూ.90.43 వద్ద ఆల్ టైమ్ కనిష్ట స్థాయికి చేరుకుందని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. పార్లమెంట్ ఆవరణలో రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే విలేకరులతో మాట్లాడుతూ "రూపాయి పడిపోతోందని నేను చెప్పాను. దీని అర్థం దేశ ఆర్థిక పరిస్థితి బాగా లేదని. మనం అభివృద్ధి చెందుతున్నామని, ఆర్థిక పరిస్థితి బాగుందని వారు ఎప్పుడూ చెబుతారు. కానీ రూపాయి పడిపోయినప్పుడు, అది మన ఆర్థిక పరిస్థితి ఏమిటో చూపిస్తుంది" అని అన్నారు. కొన్నేండ్ల క్రితం మన్మోహన్ సింగ్ హయాంలో రూపాయితో పోలిస్తే డాలర్ విలువ ఎక్కువగా ఉన్నప్పుడు, బీజేపీ నేతలు ఏమన్నారని ప్రియాంకా గాంధీ ప్రశ్నించారు. మరిప్పుడు నెలకొన్న పరిస్థితికి బీజేపీ నేతలు ఏం సమాధానం చెబుతారన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి పతనం అవుతోందని తెలిపారు.

లోక్‌సభలో ఆరోగ్య భద్రత జాతీయ భద్రతా పన్ను బిల్లును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. మరోవైపు కేంద్ర ఎక్సైజ్ (సవరణ) బిల్లును రాజ్యసభ తిరిగి లోక్‌సభకు పంపడంతో పార్లమెంటు ఆమోదం పొందినట్టు ప్రకటించారు.

గత ఐదేండ్లలో విదేశీ ఇమ్మిగ్రేషన్ అధికారులు 62 మంది భారతీయ విద్యార్థులు అమెరికాకు వెళ్లకుండా నిరాకరించారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు విదేశాంగ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అలాగే 11 మంది విద్యార్థులను కిర్గిజ్‌స్తాన్‌కు వెళ్లకుండా నిరాకరించారు. అయితే గత ఐదేండ్లలో యూకే 170 మంది, ఆస్ట్రేలియా 114 మంది, రష్యా 82 మంది, అమెరికా 45 మంది, ఉక్రెయిన్ 13 మంది, ఫిన్‌లాండ్ ఐదుగురు ఇండియా విద్యార్థులను బహిష్కరించాయి.



## పుతిన్‌కు ప్రధాని మోదీ స్వాగతం

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

భారత్ చిరకాల మిత్రదేశం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నాలుగేళ్ల విరామం తర్వాత రెండురోజుల అధికార పర్యటనగా గురువారం నాడు ఢిల్లీకి చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6.40 గంటలకు ఆయన ప్రత్యేక విమానం ఢిల్లీలోని పాలం టెక్నికల్ ఏరియాలో ల్యాండ్ అయింది. రష్యా అధ్యక్షుడి రాక సందర్భంలో ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా విమానాశ్రయానికి చేరుకుని పుతిన్‌కు స్వాగతం పలికారు. విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన భారతీయ కళాకారుల సంప్రదాయ ప్రదర్శనలను పుతిన్ ఆసక్తిగా వీక్షించారు. తర్వాత ప్రధాని మోదీ – పుతిన్‌లు ఒకే వాహనంలో కలిసి బయలుదేరడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పుతిన్‌కు ఇష్టమైన వంటకాలను ప్రత్యేకంగా సిద్ధం చేసినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు, వాణిజ్యం, రక్షణ సహకారం తదితర అంశాలపై శుక్రవారం కీలక చర్చలు జరగనున్నాయి.

## ఢిల్లీ పరిస్థితి హైదరాబాద్‌కు రావద్దనే హిల్ట్ పాలసీ

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఢిల్లీ మొత్తం కాలుష్యమయంగా మారిందనీ, అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రావద్దనే హిల్ట్ పాలసీని తీసుకొచ్చినట్టు టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అలాంటి పాలసీపై విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. బీఆర్ఎస్ నేతలు పదేండ్లు తెలంగాణను అమ్మేసుకున్నా బీజేపీ నాయకులు మాట్లాడలేదని గుర్తుచేశారు. హిల్ట్ పాలసీతో కాలుష్యం, భూముల ధరలు తగ్గే అవకాశముంటే దానిపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సామెతలా మాట్లాడిన దానిని బీజేపీ వక్రీకరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సినీ గాయకులు ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహం ఏర్పాటుపై రాద్ధాంతం చేయడం తగదన్నారు. కళాకారులు, సాహిత్యకారులకు కుల, మతాలను ఆపాదించడం తగదని, తెలంగాణ, ఆంధ్ర భౌగోళికంగా విడిపోయినా అన్నదమ్ముల్లా కలిసి ఉందామని సూచించారు. రెండేండ్ల ప్రజాపాలనా ఉత్సవాల దృష్టి మళ్లించేందుకే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇన్ అండ్ ఔటర్ భూములను బీఆర్ఎస్ అమ్మకానికి పెట్టినప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఆయన వ్యాఖ్యలతో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని తేలిపోయిందని తెలిపారు.

## చాట్‌జీపీటీతో స్కామర్‌కు గట్టి షాక్

- వెబ్‌పేజీ ట్రాప్ వేసి జీపీఎస్ లొకేషన్, ఫొటో క్యాప్చర్ చేసిన ఢిల్లీ యువకుడు

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**




ఒక ఆన్‌లైన్ మోసగాడిని చాట్‌జీపీటీ సాయంతో ఢిల్లీకి చెందిన యువకుడు బుద్ధివంతంగా బుట్టలో వేసాడు. సోషల్ మీడియా ద్వారా మోసం చేయాలని ప్రయత్నించిన స్కామర్‌ను, అదే టెక్నాలజీతో వల వేసి జీపీఎస్ లొకేషన్‌తో పాటు అతని ముఖ ఫొటోను కూడా క్యాప్చర్ చేసి షాక్‌కు గురి చేశాడు. దీంతో భయపడిన స్కామర్ చివరకు క్షమించమని వేడుకోక తప్పకుండా ??ఖ?వ ఈ సంఘటన ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది.

ఢిల్లీ వ్యక్తికి ఫేస్‌బుక్‌లో 'కాలేజ్ సీనియర్, ప్రస్తుతం ఐఏఎస్ అధికారి' అని చెప్పుకుంటూ ఒక వ్యక్తి సందేశం పంపాడు. సీఆర్పీఎఫ్ అధికారి అయిన తన స్నేహితుడు బదిలీ కావడంతో ఇంటి సామాన్లు, విలువైన వస్తువులను చాలా తక్కువ ధరకు అమ్ముతున్నట్లు చెప్పాడు. సందేశం అనుమానాస్పదంగా ఉండడంతో యువకుడు తన అసలు సీనియర్‌ను వాట్సాప్ ద్వారా సంప్రదించాడు. ఇది పూర్తిగా ఫేక్ మెసేజ్ అని తేలింది.కొంతసేపటి తర్వాత ఆర్మీ ఫొటో ఉన్న మరో నంబర్ నుంచి స్కామర్ తిరిగి సంప్రదించాడు. క్యూఆర్ కోడ్ పంపి చెల్లింపు చేయాలని ఒత్తిడి చేశాడు. అయితే ఢిల్లీ వ్యక్తి చెల్లింపు సమస్యలున్నట్లుగా నటించాడు. అదే సమయంలో చాట్‌జీపీటీ సాయంతో ఒక స్పెషల్ వెబ్‌పేజీని రూపొందించాడు. అతను పంపిన ట్రాకర్ లింక్‌లోకి ప్రవేశించిన వ్యక్తి జీపీఎస్ లొకేషన్, ఐపీ చిరునామా, అలాగే డివైజ్‌లోని కెమెరా ద్వారా ఫొటో ఆటోమేటిక్‌గా క్యాప్చర్ అయ్యేలా కోడ్ సెట్ చేసాడు.ఏమాత్రం అనుమానం లేకుండా స్కామర్ ఆ లింక్‌ను క్లిక్ చేయడంతో, క్షణాల్లో అతడి ఖచ్చితమైన లొకేషన్, ముఖ చిత్రం, డివైజ్ వివరాలు ఢిల్లీ యువకుడి వద్దకు చేరాయి. వెంటనే అతడు ఆ సమాచారాన్ని తిరిగి స్కామర్‌కు పంపాడు. "రాజస్థాన్ పోలీసులు నీ దగ్గరకు వస్తున్నారు జైలు జీవితాన్ని ఎంజాయ్ చెయ్యి" అంటూ హెచ్చరించాడు. భయంతో వణికిపోయిన స్కామర్ వెంటనే మెసేజ్‌లు పంపుతూ, "అమ్మ మీద ప్రమాణం చేస్తున్నా ఇక మోసం చేయను. నన్ను క్షమించండి" అని వేడుకున్నాడు.

ఈ అనుభవాన్ని ఢిల్లీ యువకుడు రెడ్డిట్‌లో పోస్ట్ చేయగా, అది సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అయింది. టెక్నాలజీని మోసాలకు మాత్రమే కాకుండా, మోసగాళ్లను పట్టుకునేందుకు కూడా వాడుకోవచ్చని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

## ప్రసారభారతి చైర్మన్ రాజీనామా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రసారభారతి బోర్డు చైర్మెన్ నవనీత్ కుమార్ సెహగల్ తన పదవికి రాజీనామా చేశారు. ప్రసారభారతి చట్టంలోని సెక్షన్ 7 (6) ప్రకారం ఆయన రాజీనామాను కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆమోదించింది. సెహగల్ 1988 బ్యాచ్‌కి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. ఆయన ఉత్తరప్రదేశ్ కేడర్‌కు చెందిన వారు. గత సంవత్సరం మార్చి 16న ఆయనను ప్రసారభారతి బోర్డు చైర్మెన్‌గా ప్రభుత్వం నియమించింది. సెహగల్‌కు 35 సంవత్సరాల సుదీర్ఘ నాయకత్వ అనుభవం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో అనేక కీలక విభాగాలకు ఆయన నేతృత్వం వహించారు. పరిపాలన, విధాన సంస్కరణల్లో తనదైన ముద్ర వేశారు. మీడియా, ప్రజా సంబంధాలు, సాధారణ పరిపాలన, ఫైనాన్స్, శాంతి భద్రతలు, పరిశ్రమ, భూ యాజమాన్యం, హోం వ్యవహారాలు వంటి అనేక రంగాలలో ఆయనకు అపారమైన అనుభవం ఉంది. 2023 జులైలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శిగా ఆయన పదవీ విరమణ చేశారు.

## హిల్ట్ పేరుతో భారీ భూ కుంభకోణం




- పరిశ్రమల భూములను అపార్ట్‌మెంట్లు, విల్లాలకు మార్చే కుట్ర
- గజానికి రూ.1.50 లక్షల భూమి రూ.4,000కే అప్పగింత
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హెచ్ఐఎల్‌టీపీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ 5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హెచ్ఐఎల్‌టీపీ మీద బీఆర్ఎస్ పోరుబాటలో భాగంగా గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో పార్టీ నాయకుల బృందంతో కలిసి ఆయన పర్యటించారు. ఆయా ప్రదేశాలలో హమాలి కార్మికులతో కూర్చొని కాంగ్రెస్ సర్కార్ కుట్రలు చేస్తున్నదని వారికి వివరించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు.

ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలకు, పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుటి ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నదని తెలిపారు. పరిశ్రమలు వద్దంటూ.. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టుకోవాలని పారిశ్రామిక భూములను ఇస్తున్నారన్నారు. మార్కెట్‌లో గజం ధర రూ.1 లక్ష 50 వేలు పలుకుతుంటే, ప్రభుత్వం కేవలం రూ.4,000కే ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పుతోందన్నారు. నగరంలో పేదల ఇండ్లకు, పాఠశాలలకు, ఆస్పత్రులకు, చివరికి స్మశానాలకు కూడా స్థలం లేదు కానీ, ప్రయివేటు వ్యక్తులకు 9,300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటోందని విమర్శించారు. ఈ భూములను వెనక్కి తీసుకుని ఇండ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు నిర్మించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉందని, వాటిపై ఆధారపడిన లక్షలాది మంది ఉపాధి కోల్పోతారన్నారు.కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామని తెలపారు. ఈ అంశాన్ని ఇక్కడితో వదిలిపెట్టబోమని త్వరలో అఖిల పక్ష సమావేశం,

మిగితా 4వ పేజీలో

## ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయాలి

- రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా నియమావళిని కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి జిల్లాల ఎస్పీలను ఆదేశించారు. గురువారం ఉత్తర తెలంగాణకు చెందిన ఆరు జిల్లాల ఎస్పీలతో గ్రామ పంచాయతీ ఎన్నికల బందోబస్తుపై ఆయన సమీక్షను నిర్వహించారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ఎస్పీలు, నగర కమిషనర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లా డుతూ ఓటర్లు స్వేచ్ఛగా శాంతియుత వాతావర ణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని చర్యలూ తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. ఓటర్లను ప్రలోభ పెట్టడం, బెదిరించడం, ఒత్తిడి తీసుకురావడం వంటి చర్యలకు ఎన్నికల్లో పోటీ చేస్తున్నవారు ఎవరు పాల్పడినా ఉపేక్షించరాదనీ, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా స్థానికంగా పాత కక్షలతో పాటు వివిధ అంశాలపై భేదాభిప్రాయాలు పొడసూపి హింసాత్మక ఘటనలు చోటుచేసుకునే ప్రమాదమున్నదనీ, వాటిని ముందుగానే గుర్తించి నివారణ చర్యలను చేపట్టాలని డీపీజీ సూచించారు. సెక్షన్ 30 ప్రకారం నిషేదాజ్ఞలను అమలు చేయాలనీ, రౌడీలు, గూండాలను బైండో వర్ చేసే విషయంలో చర్యలు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎక్కువ శాతం ఓట్లు పోలయ్యేలా వాతావరణాన్ని కల్పించాలనీ, ఎన్నికల అధికారులతో సమన్వయం అవుతూ పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

## వీధి కుక్కలు వెంబడించడంతో బైకుపై నుంచి పడి యువకుడు మృతి



**బలగం టీవీ, వరంగల్**

వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మచ్చాపూర్ గ్రామంలో, హన్మకొండలో ఉద్యోగం ముంగించుకుని వస్తున్న ఎలుకుర్తి గ్రామానికి చెందిన ఆడెపు శివకుమార్(24) అనే యువకుడిని వెంబడించిన వీధి కుక్కలు, దీంతో కుక్కల నుండి తప్పించుకునేందుకు వేగంగా వాహనం నడిపి అదుపుతప్పి డ్రైనేజీలో పడి మృతి చెందిన శివకుమార్. రాష్ట్రంలో వీధి కుక్కల వల్ల రోజుకో ప్రాణం పోతున్నా, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు.




## ఒక్క ఎస్టీ మహిళా ఓటరు లేని గ్రామానికి ఎస్టీ మహిళా సర్పంచ్ రిజర్వేషన్

**బలగం టీవీ, నల్గొండ**

నల్గొండ జిల్లా, అనుముల మండలం పరిధిలోని పేరూరు గ్రామ సర్పంచ్ స్థానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ మహిళకు రిజర్వ్ చేసింది.అయితే, ఆ గ్రామంలో ఒక్క ఎస్టీ మహిళా ఓటరు కూడా లేరు. దీంతో, సర్పంచ్ పదవికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.అంతేకాక, మొత్తం ఎనిమిది వార్డుల్లో ఏకంగా నాలుగు వార్డులను ఎస్టీలకు కేటాయించడం కూడా తీవ్ర వివాదాస్పదమైంది.



## ప్రైవేట్ ఆస్పత్రులపై డీఎంహెచ్ఓ కొరడా..!

- **కలెక్టర్ ఆదేశాలతో ఆకస్మిక తనిఖీలు..**
- **నిబంధనలు విస్మరిస్తే సీజే!..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత సిరిసిల్ల పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ లో భాగంగా గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా ఆమె ఆస్పత్రుల నిర్వాహకులకు, డాక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేస్తూ, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రిసెప్షన్ కౌంటర్ యందు చికిత్సలకు సంబంధించిన ధరల పట్టిక వివరాలు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్, వైద్యులు మరియు సిబ్బంది వివరాలు తప్పనిసరిగా కనిపించేలా ప్రదర్శించాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. అంతేకాకుండా, హాస్పిటల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలు పాటించాలని, వ్యాధిగ్రస్తులకు కనీస వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. అర్హత కలిగిన వైద్యులు మరియు సిబ్బందిని మాత్రమే నియమించాలని, డయాగ్నస్టిక్ కేంద్రాలు మరియు ల్యాబ్‌లను రిజిస్ట్రేషన్ చేయాలని స్పష్టం చేశారు. హాస్పిటల్ రికార్డులు మరియు సరైన మెడికల్ రిపోర్టులు క్రమంగా ఉంచాలని ఆమె హెచ్చరించారు. నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్న హాస్పటళ్లను రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని లేదా సీజ్ చేస్తామని ఈ సందర్భంగా డాక్టర్ రజిత తెలియజేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ర్యాగింగ్ భూతాన్ని అరిట్టాలి

- **ర్యాగింగ్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి.**
- **ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో ర్యాగింగ్ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం మెడికల్ కళాశాలలతో పాటు పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో కూడా ర్యాగింగ్ ఘటనలు నమోదయ్యాయని కమిటీ పేర్కొంది. ముఖ్యంగా సంగారెడ్డి మెడికల్ కళాశాలలో చోటుచేసుకున్న ఘటన అత్యంత దారుణమని పేర్కొంది. ర్యాగింగ్‌ను అరికట్టేందుకు పోలీసు శాఖ తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ర్యాగింగ్ నిరోధక చట్టాలను ఖచ్చితంగా అమలు చేసిన కళాశాలలకు మాత్రమే అనుమతులు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న కళాశాలల్లో అయితే మరింత కఠినంగా పర్యవేక్షణ ఉండాలని సూచించింది. సంగారెడ్డి ఘటనలో పాల్గొన్న సీనియర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులుగా తేలిన వారికి తప్పనిసరిగా శిక్ష విధించాలని ఎస్ఎఫ్ఐ కోరింది. రాష్ట్రవ్యాప్తంగా ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టాలని సంఘం నాయకులు అభ్యర్థించారు.

# తెలంగాణ శాస్త్రీయ నృత్య కళా సంపద

## కాకతీయం తెలంగాణ నాట్యం

- **ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**
- **కాకతీయం తెలంగాణ నాట్యం గ్రంథం ఆవిష్కరణ**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ శాస్త్రీయ నత్య కళా సంపద కాకతీయం అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు పద్మజా రెడ్డి విశేష పరిశోధన చేసి రచించిన కాకతీయం తెలంగాణ నాట్యం గ్రంథం కర దీపికగా ఉపయుక్తం అని అభినందించారు నాట్య గురు పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ జి. పద్మజారెడ్డి గత పదేండ్లుగా వరంగల్ సమీప దేవాలయాల్లో, రామప్ప గుడిలో శిలా శాసనాలు, శిల్పాలు, వివిధ నత్య గ్రంథాలు, జాయాపసేనాని రచించిన నత్త రత్నావళి పరిశీలించి పరిశోధించి, నత్య మేధావులతో చర్చించి రచించిన కాకతీయం తెలంగాణ నాట్యం గ్రంథావిష్కరణ రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై ప్రణవ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి నిర్వాహణలో గురువారం జరిగింది. ఈ గ్రంథాన్ని ఢిల్లీలోని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ నేషనల్ బుక్ ట్రస్ట్ వారు ప్రచురించగా డిప్యూటీ సీఎం ఆవిష్కరించి




మాట్లాడారు.

కాకతీయుల కాలం నాటి చరిత్రను పరిశోధించి ఒక శాస్త్రీయ నత్య సంపదను వెలుగులోకి తీసుకురావడం గర్వకారణం అని అభినందించారు. కాకతీయంపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సర్వీస్ కమిషన్ చైర్మెన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ చరిత్రను పరిశోధించి తెలంగాణలో నాట్యానికి ఉన్న ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పడం అభినందనీయం అన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి యోగితా రాణా మాట్లాడుతూ పద్మజారెడ్డి గొప్ప సాహసం చేశారని, తెలంగాణలో కాకతీయుల కాలం నాటి నత్య ప్రక్రియను వెలుగులోకి తీసుకొచ్చేందుకు పదేండ్లు శ్రమించారని అభినందించారు. గ్రంథ రచయిత మాట్లాడుతూ చరణ, రసకం, గొండలి, పేరిణి, గుస్సాడి, ఘటిసాని, కోలాటం, డప్పు, కందుక తదితర నత్యాలు కాకతీయ కాలంలో ఉన్నాయని, వాటాన్నింటిని మేళవించి తెలంగాణకు ప్రత్యేక నాట్యం ఉండాలనే సదుద్దేశ్యంతో కాకతీయం అని నామకరణం చేసినట్టు తెలిపారు. నటరాజ రామకష్ణ పేరిణిని వెలుగులోకి తెచ్చారని, కానీ కాకతీయుల కాలంలో యుద్ధ కళలు, జానపదంతో పాటు శాస్త్రీయ సాంప్రదాయ నత్య కళలు అనేకం విరాజిల్లాయని ఆమె అన్నారు. అనంతరం ఆమె శిష్య బందం ప్రదర్శించిన కాకతీయం నత్యాంశాలు అలరించి ఆలోచనలు రేకెత్తించాయి. నేర్చుకో వడానికి అనుగుణంగా అడుగుల వారీగా శాస్త్రీయంగా సరళంగా అర్ధమయ్యే రీతిలో శిల్పా లు, జతిస్వరాలు, హస్త ముద్ర పాద విన్యాసాలు, కరణాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, ప్రఖ్యాత గాయని డాక్టర్ శోభారాజు, పర్యాటక సాంస్కతిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, బి. ఆచార్య మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, సీనియర్ పాత్రికేయులు సుశీల్ రావు, డాక్టర్ మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో గాయపడిన బాలుడికి మంత్రి పరామర్శ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎల్బీనగర్ మన్సూరాబాద్ సమీపంలోని శివగంగా కాలనీలో ప్రేమ్‌చంద్ అనే బాలుడిని గురువారం ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పరామర్శించారు. బాలుడి తల్లిదండ్రులు తిరుపతి రావు–చంద్రకళ దంపతులకు మంత్రి అత్యవసర సాయం కింద రూ.1 లక్ష చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, బాలుడికి ప్రత్యేక పాఠశాలలో అడ్మిషన్ కల్పించి అతడి విద్యను ప్రభుత్వం చూసుకుంటుందని హామినిచ్చారు. ఈ హదయ విదారక ఘటన తనను ఎంతో కలిచివేసిందన్నారు. ప్రభుత్వం తరపున కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.ఘటన విషయం తెలియగానే వెంటనే అధికారులు నిలోఫర్ ఆసుపత్రికి వెళ్లి కుటుంబంతో మాట్లాడి వివరాలు సేకరించినట్టు మంత్రి తెలిపారు. బాలుడి సంపూర్ణ వైద్య సంరక్షణను ప్రభుత్వం దగ్గరుండి చేసుకుంటుందని స్పష్టం చేశారు. బాలుడికి అవసరమైన సహాయక చర్యలన్నీ ప్రభుత్వం నుంచి అందిస్తున్నామని తెలిపారు.

మంత్రి అడ్లూరి ఆదేశాల మేరకు బాలుడికి సంబంధిత శాఖ అధికారులు ఆ బాలుడికి దివ్యాంగుల గుర్తింపు కార్డు తక్షణమే జారీ చేశారు. అలాగే అర్హత ప్రకారం దివ్యాంగ పింఛను మంజూరు చేయటం, అలాగే కోలుకున్న తర్వాత బాలుడికి కావలసిన సంరక్షణ కు కావలసిన



సదుపాయాలు పూర్తిగా కల్పించడం దీంతో పాటు వైద్య చికిత్స, పునరావాస సహాయ అందించడం కోసం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో ఎప్పుడు , ఎక్కడ, చోటు చేసుకున్న జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారులు ఆలస్యం చేయకుండా బాధిత కుటుంబాలను సందర్శించి, అవసరమైన సేవలు, సహాయం వెంటనే అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగుల శాఖ కమిషనర్ అనిత రామచంద్రన్, డైరెక్టర్ శైలజ , నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయ్ కుమార్, ఆర్ఎంఓ డా ఆనంద్ , లాలూ ప్రసాద్, బాబురావు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ దామోదర్‌కు కేటీఆర్ నివాళి

**బలగం టీవీ, హైదరాబాద్**

వీడియో జర్నలిస్ట్ దామోదర్ అకాల మరణంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.దామోదర్ మృతదేహానికి గాంధీ హాస్పిటల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళ్లర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇలాంటి విషాద సమయంలో బీఆర్ఎస్ పార్టీ తరపున వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ "తెలంగాణ ఉద్యమ కాలం నుంచి దామోదర్ నాకు పరిచయం. అతను విలక్షణమైన మీడియా మిత్రుడు" అని పేర్కొన్నారు. కేటీఆర్ వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, క్రిశాంక్ తదితరులు ఉన్నారు.

కేటీఆర్ సూచనల మేరకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు వెంటనే ఆస్పత్రికి చేరుకున్నారు.



మధ్యాహ్నం 3 గంటల వరకు ఆస్పత్రిలోనే ఉండి దామోదర్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. సీపీఆర్, అత్యవసర చికిత్సలు, ఇతర వైద్య చర్యలు వేగంగా జరిగేలాగా ఆస్పత్రి యాజమాన్యంతో సమన్వయం చేశారు. ప్రాణాలు కాపాడేందుకు చాలా కషి చేసినప్పటికీ ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## సైబరాబాద్, రాచకొండ పోలీస్ వెబ్‌సైట్లు డౌన్

### పునరుద్ధరించిన అధికారులు

**బలగం టీవీ, హైదరాబాద్**

సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల అధికారిక వెబ్‌సైట్‌లు వారం రోజులుగా పనిచేయకపోవడంతో కలకలం రేగింది. అయితే టెక్నికల్ నిపుణులు వెబ్‌సైట్లను గురువారం పునరుద్ధరించారు. దీనిపై సైబరాబాద్ ఎస్బీ అండ్ ఇన్‌చార్జి, సైబర్ క్రైమ్స్ డీసీపీ వై.వీ.ఎస్. సుధీంద్ర స్పందిస్తూ నవంబర్ 15, 2025 నుంచి సైబరాబాద్ పోలీసుల అధికారిక వెబ్‌సైట్ మెయింటెనెన్స్, అప్‌గ్రేడ్ పనుల కారణంగా తాత్కాలికంగా అందుబాటులో లేదన్నారు. అత్యవసర సాంకేతిక నిర్వహణ, భద్రతను పెంచేందుకు చేపట్టిన పనుల కారణంగానే వెబ్‌సైట్ డౌన్‌టైం జరిగిందన్నారు. ప్రస్తుతానికి www.cyberabadpolice.gov.in పోలీస్ వెబ్‌సైట్ పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. ప్రజలు సమాచారం, వివిధ సేవలు కోసం వెబ్‌సైట్‌ను ఇకపై యథావిధిగా వినియోగించుకోవచ్చని డీసీపీ సూచించారు.

# మాజీ సీఎం రోశయ్యకు కలెక్టర్ నివాళి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య వర్ధంతిని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా యువజన అండ్ క్రీడల శాఖ అధికారి రాందాస్, ఏవో రాంరెడ్డి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో బీజేపీ 'నల్ల బ్యాడ్జీ' నిరసన..

- **హిందూ దేవుళ్లపై సీఎం చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం**
- **బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్ళపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, బుధవారం రోజు సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారతీయ జనతా పార్టీ సిరిసిల్ల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. బీజేపీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. హిందూ దేవుళ్ళను అవమానించే ధైర్యం ఎవరికి ఉండకూడదని, ముఖ్యమంత్రి పదవిలో కూర్చున్న వ్యక్తి హిందూ భావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడడం అర్హతలేనిది, బాధ్యతారాహిత్యం. హిందూ సమాజం శాంతిని ప్రేమిస్తుంది, కానీ అవమానాన్ని అస్సలు సహించదు. ఇంతకుముందు, మాజీ మంత్రి కేటీఆర్ 'నేను దేవుళ్లను నమ్మను' అన్న వ్యక్తిని హనుమాన్ స్వాములతో కూర్చోబెట్టి హనుమాన్ జపం చేయించిన ఘనత బీజేపీది అని గుర్తు చేశారు. ఇకపై ఎవ్వరైనా హిందూ దేవుళ్లపై అపమానకర వ్యాఖ్యలు చేస్తే, బీజేపీ దీన్ని అత్యంత తీవ్రంగా



ఎదుర్కొంటుంది. మేము నిశ్శబ్దంగా కూర్చోబోము, అని హెచ్చరిక చేశారు. ముఖ్యమంత్రి పదవిలో కూర్చున్న వ్యక్తి హిందూ భావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడడం అర్హతలేనిది, బాధ్యతారాహిత్యమని, హిందూ సమాజ ఏకతను బలంగా ప్రదర్శించడం, ప్రజలు, కార్యకర్తల నుండి ఈ నిరసనకు విస్తృత స్పందన లభించిందని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మ్యాన రామ్ ప్రసాద్, సీనియర్ నాయకులు గూడూరి భాస్కర్, పట్టణ ఉపాధ్యక్షులు మోర శ్రీహరి, అంకారపు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శులు మెరుగు శ్రీనివాస్, కొండ నరేష్, అధికార ప్రతినిధులు మోర రవి, చొప్పదండి శ్రీనివాస్, దూడం సురేష్, సూరం వినయ్, చొక్కి శ్రీనివాస్, రచ్చ రాహుల్, నరసయ్య తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ మాల సంఘాల ఉమ్మడి పోరాటం..




- **ఎస్సీ వర్గీకరణలో రిజర్వేషన్ వాటాపై..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల, మరియు మాల ఐక్యవేదిక కన్వీనర్ తుంగ శివరాజ్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఆ పార్టీలో ఉన్న మాల మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు ఎమ్మెల్సీలు, వర్గీకరణ జరిగేటప్పుడు మాల సామాజిక వర్గానికి రావలసిన శాతం రిజర్వేషన్ అడగకపోవడం వల్ల, మాల సామాజిక వర్గం రిజర్వేషన్ కోల్పోయిందని వారు చెప్పడం జరిగింది. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించాలని, రెండు శాతం అదనంగా రిజర్వేషన్ ఇవ్వాలని, 20 లోపు రెండు రోస్టర్ పాయింట్స్ కేటాయించాలని, ఇది ఆ సామాజిక వర్గాల నుంచి ఎదిగిన రాజకీయ నాయకుల బాధ్యత అని వారు గుర్తు చేశారు, లేకపోతే మాల సామాజిక వర్గం వారి పదవులు వదులుకోవాలని గుర్తు చేస్తాఉన్నాం మాలలకు రిజర్వేషన్ లేకుండా చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయాలని మాలల కు పిలుపునిస్తా ఉన్నాం. గ్రామ పునాదుల వరకు, జేఏసీ నిర్మాణం చేయాలని, మనకు రావలసినటువంటి న్యాయమైన వాటా కొరకు, ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని, విద్యార్థులకు యువకులకు ఉద్యోగస్తులకు, మాల ప్రజలకి పిలుపునిస్తా ఉన్నాం. హక్కులకై బిక్షమెతకండి పోరాడి సాధించుకోమని చెప్పిన బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానంతో,భాగ్యరెడ్డి వర్మ ఉద్యమ స్ఫూర్తితో, పనిచేసి రిజర్వేషన్లు సాధించుకునేంతవరకు మాడమ తిప్పని పోరాటం చేయాలని మాల ప్రజలకి పేరుపేరునా విజ్ఞప్తి చేస్తాఉన్నాం. పాల్గొన్న నాయకులు. మందాల భాస్కర్ తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ గారు.చెరుకు రామ్ చందర్ గౌరవ అధ్యక్షుడు గారు. బేరా బాలకిషన్ గ్రేటర్ చైర్మన్ గారు, తుమ్మ శ్రీనివాస్ వైస్ చైర్మన్ గారు, మాదాసి రాహుల్ స్టూడెంట్ జేఏసీ చైర్మన్గారు, ఓయూ జేఏసీ చైర్మన్ బత్తుల రమేష్.

తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల మరియు మాల ఐక్యవేదిక కన్వీనర్ తుంగ శివరాజ్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఒక ముఖ్యమైన ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఎస్సీ వర్గీకరణ చట్టంలో మాల సామాజిక వర్గానికి రావాల్సిన రిజర్వేషన్ వాటాను కోల్పోవడంపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల వైఖరిని వారు తప్పుబట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ జరిగేటప్పుడు, మాల సామాజిక వర్గానికి దక్కవలసిన శాతం రిజర్వేషన్ వాటాను వారు ప్రశ్నించకపోవడం వల్లనే మాల సామాజిక వర్గం రిజర్వేషన్ కోల్పోయిందని వారు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించాలి మరియు మాలలకు రెండు శాతం అదనంగా రిజర్వేషన్ కల్పించాలి. 20 లోపు రెండు రోస్టర్ పాయింట్స్ కేటాయించాలి. ఈ డిమాండ్లను సాధించడం అనేది తమ సామాజిక వర్గం నుంచి ఎదిగిన రాజకీయ నాయకుల బాధ్యత అని వారు గుర్తు చేశారు. తక్షణమే రిజర్వేషన్ సమస్యను పరిష్కరించకపోతే, కాంగ్రెస్ పార్టీలో మాల సామాజిక వర్గానికి చెందిన పదవులలో ఉన్నవారు వాటిని వదులుకోవాలని హెచ్చరించారు. మాలలకు రిజర్వేషన్ లేకుండా చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయాలని మాల ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామ పునాదుల వరకు జేఏసీ నిర్మాణం చేపట్టాలని, తమకు రావలసిన న్యాయమైన వాటా కొరకు ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని వారు పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో పాల్గొనాలని విద్యార్థులు, యువకులు, ఉద్యోగస్తులు సహా మాల ప్రజలందరినీ కోరారు. "హక్కులకై బిక్షమెత్తకండి పోరాడి సాధించుకోండి" అని చెప్పిన బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానంతో, భాగ్యరెడ్డి వర్మ ఉద్యమ స్ఫూర్తితో పనిచేసి, రిజర్వేషన్లు సాధించుకునేంతవరకు తమ పోరాటం ఆపబోమని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మాందాల భాస్కర్, గౌరవ అధ్యక్షుడు చెరుకు రామ్ చందర్, గ్రేటర్ హైదరాబాద చైర్మన్ బేరా బాలకిషన్, వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్, మాల స్టూడెంట్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్, ఓయూ జేఏసీ చైర్మన్ బత్తుల రమేష్, మాలాల ఐక్యవేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ తుంగ శివరాజ్, మాలాల ఐక్యవేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా కో – కన్వీనం జక్కుల యాదగిరి, మాలాల ఐక్యవేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా కో – కన్వీనర్ బూర యాదగిరి, బొల్లం గణేష్, పాటి రాజ్‌కుమార్, సిరిగిరి మురళి, ఎర్ర ఆగేష్, సిరిగిరి నర్సయ్య (అడ్వకేట్), సిరిగిరి ప్రసాద్, జంగ భూమరాజు, బండ రాజు తదితరులు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ పరిశీలన

**బలగం టీవీ, బోయినిపల్లి**

వేములవాడ అర్బన్ మండలం అనుపురం, బోయినిపల్లి మండలం మానువాడలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 గా నిర్ణయించిందని తెలిపారు. రైతులు తమ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి తహసీల్దార్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు..

- **రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే.**
- **ఎల్లారెడ్డిపేట,ముస్తాబాద్ మండలాలలో పలు నామినేషన్ సెంటర్స్‌తో పాటు పెద్దమ్మ, వెంకట్రావుపల్లి చెక్ పోస్ట్‌లను ఆకస్మికంగా తనిఖీ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గ్రామపంచాయితీ ఎన్నికల సందర్భంగా ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలలో ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్స్ తో పాటుగా పెద్దమ్మ, వెంకట్రావుపల్లి చెక్ పోస్ట్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి విధుల్లో ఉన్న సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే గ్రామ పంచాయతీలకు ,వార్డులకు మూడవ విడత నామినేషన్ ప్రక్రియ ప్రారంభ కావడం జరిగిందని, నామినేషన్ ప్రక్రియకు అనుగుణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లును చేయడం జరిగిందన్నారు.సర్పంచ్ ఎన్నికల సందర్భంగా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షణ కొనసాగిస్తు అక్రమ మద్యం, డబ్బు రవాణాలను అడ్డుకునేందుకు ప్రతీ వాహనాన్ని చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీసు యంత్రంగం పకడ్బందీ చర్యలు చేపడుతుందని,దీనిలో భాగంగా పోలీస్ సిబ్బంది గ్రామాలను తరచూ సందర్శిస్తూ ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నమని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లగించిన వారిపై ఇప్పటికే ఒక కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి బెల్ట్‌షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించగా, 20 కేసుల్లో 209 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 158 కేసుల్లో 657 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. స్పీ వెంట సి.ఐ లు శ్రీనివాస్, మొగిలి,ఎస్.ఐ లు గణేష్, అనిల్ సిబ్బంది ఉన్నారు.



# ఎంపీడీఓ కార్యాలయాలను తనిఖీ చేసిన జిల్లా వ్యయ పరిశీలకులు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా పలు ఎంపీడీఓ కార్యాలయాలను ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. బోయినిపల్లి, ఇల్లంతకుంట ఎంపీడీఓ కార్యాలయాలను పరిశీలించారు. అక్కడ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి నవీన్, భారతి, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## రేపు 'మన శంకర వరప్రసాద్‌గారు' సెకండ్ సింగిల్

**బలగం టీవీ, హైదరాబాద్**

సంక్రాంతికి పెద్ద తెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్న మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమాపై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ వచ్చేసిన నేపథ్యంలో, చిత్రబృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సెకండ్ సింగిల్ ఈ నెల 6న విడుదల కానుందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'శశిరేఖ' అనే పేరుతో వస్తున్న ఈ సాంగ్ మంచి బీట్‌తో పాటు మెలోడియస్ వైబ్ కలిగిన ట్రాక్‌గా నిలుస్తుందని చిత్రబృందం తెలిపింది. పాట విడుదల తేదీని ప్రకటిస్తూ ఒక స్టైలిష్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు.

కొత్త పోస్టర్‌లో చిరంజీవి డ్యాన్స్ స్టెప్స్ ఎనర్జీతో మెరిసిపోగా, పక్కనే నయనతార స్టైలిష్ డ్యాన్స్ పోజ్ విజువల్‌గా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంగ్‌కు సంబంధించిన ఎక్స్‌పెక్టేషన్స్‌ను ఈ పోస్టర్ మరింత పెంచేసింది. ప్రస్తుతం సినిమా షఉటింగ్ చివరి లెగ్‌కి చేరుకుంది. సంక్రాంతి రిలీజ్ కోసం పోస్ట్–ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి.



## హైదరాబాద్ దూకుడు

- **ఎలైట్ గ్రూప్-బీలో అగ్రస్థానంలో నగర జట్టు**

**బలగం టీవీ, హైదరాబాద్**

సయ్యిద్ ముస్తాక్ అలీ టోర్నీలో హైదరాబాద్ జట్టు దూకుడును కొనసాగిస్తోంది. ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలు సాధించిన హైదరాబాద్ ఎలైట్ గ్రూప్%–%బీలో అగ్రస్థానంలో నిలిచింది. గురువారం జమ్మూకశ్మీర్‌తో జరిగిన మ్యాచ్‌లో నగర జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన జమ్మూకశ్మీర్ 19.3 ఓవర్లలో 112 పరుగులకే ఆలౌట్ అయింది. నితిన్ సాయి యాదవ్: 3/17కెప్టెన్ మిలింద్: 3/31 హైదరాబాద్ బౌలర్లు అద్భుతంగా రాణించడంతో ప్రత్యర్థి పెద్ద స్కోరు చేయలేకపోయింది. చిన్న లక్ష్యాన్ని హైదరాబాద్ జట్టు 15.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తనయ్ త్యాగరాజన్ (50) అర్ధశతకం జట్టును విజయతీరాలకు చేర్చింది.

## 'బ్యాడ్ బాయ్ కార్తీక్ నుంచి పాట

**బలగం టీవీ, హైదరాబాద్**



హీరో నాగ శౌర్య నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'బ్యాడ్ బాయ్ కార్తీక్'. నూతన దర్శకుడు రామ్ దేశినా (రమేష్) దర్శకత్వం వహించారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్ పై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మించారు. గురువారం మేకర్స్ సినిమాలోని 'పొమ్మంటే..' అనే ఎమోషనల్ పాటను విడుదల చేశారు.

హారిస్ జయరాజ్ స్వరపరిచిన ఈ పాట మెలోడీ, ఎమోషన్‌తో ఆకట్టుకుంది. విడిపోవడం వల్ల కలిగే బాధను, తోబుట్టువుల అనుబంధాన్ని అందంగా ప్రెజెంట్ చేసింది.

రచయిత చంద్రబోస్ మనసుకి హత్తుకునే సాహిత్యం రాశారు. గాయకులు విజయ్ యేసుదాస్, శక్తిశ్రీ గోపాలన్ తమ వోకల్స్‌తో మరింత హార్ట్ టచ్చింగ్‌గా మలిచారు. ఈ పాట చాలా కాలం పాటు నిలిచిపోతుంది. విజువల్‌గా ఈ పాటలో నాగ శౌర్య, శ్రీదేవి విజయ్ కుమార్ మిస్ అండర్ స్టాండింగ్ ద్వారా విడిపోయిన బ్రదర్, సిస్టర్స్‌గా కనిపించారు. ఇది తోబుట్టువుల ప్రేమకు మనసుని కదిలించే సాంగ్ అని చిత్రయూనిట్ తెలిపింది.

# రూట్ సూపర్ సెంచరీతో ఇంగ్లండ్‌కు ఊపిరి

- **తొలి రోజు 325 పరుగులతో పరువు కాపాడుకున్న ఇంగ్లండ్**
- **గబ్బా టెస్టులో స్టార్క్ ఆరు వికెట్లు**




**బలగం టీవీ, బ్రిస్బేన్**

యాషెస్ సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో చిత్తుగా ఓడిన ఇంగ్లండ్ గబ్బా టెస్టులోనూ తడబడింది. అయితే కెప్టెన్ జో రూట్ (135 నాటౌట్) విలువైన సెంచరీతో జట్టును ఆదుకుంటూ ఆలౌట్ ప్రమాదం నుంచి బయటపెట్టాడు. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ (6/71) దూకుడైన బౌలింగ్ చేసినప్పటికీ రూట్ టెయిలెండర్లతో కలిసి జట్టు స్కోర్‌ను మూడు వందల కొలమానానికి చేర్చాడు.

**ఆరంభంలోనే స్టార్క్ అట్టడుగు**

పింక్‌బాల్ టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న ఇంగ్లండ్‌కు స్టార్క్ మొదటి నుంచే షాక్ ఇచ్చాడు. ఓపెనర్ బెన్ డకెట్ (0), ఓలీ పోప్ (0)ను త్వరగానే పెవిలియన్ పంపాడు. ఐదు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్‌ను రూట్%–%క్రాలే జోడీ నిలబెట్టింది.

**రూట్ తొలి గబ్బా శతకం**

మరో ఓపెనర్ జాక్ క్రాలే (76)తో కలిసి రూట్ స్కోర్‌బోర్డును ముందుకు నడిపించాడు. 181 బంతుల్లో కంగారూల గడ్డపై తొలి సెంచరీని రూట్ సాధించటం విశేషం. ఇది అతని టెస్ట్ కెరీర్‌లో 40వ శతకం.

**నెసర్–స్టార్క్ మళ్లీ దాడి**

క్రాలేను నెసర్ ఔట్ చేయడంతో ఇంగ్లండ్ మళ్లీ కష్టాల్లో పడింది. అనంతరం హ్యారీ బ్రూక్ (31), జేమీ స్మిత్ (0), విల్ జాక్స్ (19), అట్కిన్సన్ (4), బ్రైడన్ కార్సే (0)లను వరుసగా స్టార్క్ పెవిలియన్‌కు పంపాడు. 264 పరుగులకే 9 వికెట్లు కోల్పోయిన సమయంలో ఇంగ్లండ్ పూర్తిగా ఒత్తిడిలో పడింది.

**రూట్–ఆర్చర్ జోడీతో 300 దాటిన ఇంగ్లండ్**

అంతలో జోఫ్రా ఆర్చర్ (32 నాటౌట్) పట్టుదలతో ఆడుతూ రూట్‌కు అండగా నిలిచాడు. పదో వికెట్‌కు ఇద్దరూ 61 పరుగులు జోడించి స్కోర్‌ను 325కి చేర్చారు. దీంతో తొలి రోజు ముగిసేసరికి ఇంగ్లండ్ 9 వికెట్ల నష్టానికి 325 పరుగులతో నిలిచింది.

**స్టార్క్‌కు చారిత్రక రికార్డ్**

గబ్బాలో ఐదో వికెట్ సాధించిన స్టార్క్, పాక్ దిగ్గజం వసీం అక్రమ్ రికార్డును దాటాడు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ పేసర్గా కొత్త మైలురాయి నమోదు చేశాడు.

# వైజాగ్‌లో క్లైమాక్స్ వన్డేకు టీమిండియా సన్నద్ధం



- **రాయ్‌పూర్ పరాభవం తర్వాత విశాఖ చేరుకున్న రాహుల్ సేన**
- **శనివారం ఏసీఏ-వీడీసీఏలో నిర్ణయాత్మక పోరు**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాయ్‌పూర్ వన్డేలో పరాజయాన్ని మూటకట్టుకున్న భారత క్రికెట్ జట్టు మూడో మరియు నిర్ణయాత్మక వన్డే కోసం గురువారం విశాఖపట్నానికి చేరుకుంది. కెప్టెన్ కేఎల్ రాహుల్ నాయకత్వంలోని టీమిండియాకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే ఈ మ్యాచ్‌కు ముందు శుక్రవారం టీమిండియా నెట్స్‌లో తీవ్ర సాధన చేయనుంది. శనివారం ఏసీఏ%–%వీడీసీఏ స్టేడియంలో అభిమానులను ఉత్కంఠత రేపే పోరు ఎదురుచూస్తోంది.మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరు జట్లు చెరో విజయం సాధించడంతో సిరీస్ ఎవరిదన్నది ఆసక్తికరంగా మారింది. తొలి రెండు వన్డేల్లో భారీ పరుగులు నమోదవ్వడంతో వైజాగ్ వికెట్ ఎలా ఉండబోతోందన్న ప్రశ్నపై చర్చ నడుస్తోంది.

ఈ స్టేడియంలో అత్యధిక స్కోరు 354/7. 2007 ఫిబ్రవరి 17న శ్రీలంకపై భారత్ సాధించిన ఈ భారీ స్కోరులో రోహిత్ శర్మ 148 పరుగులతో టాప్ స్కోరర్ అయ్యాడు. రెండో అత్యధిక స్కోర్ 351/4, మూడో అత్యధికం 350/6. దీంతో తాజా మ్యాచ్‌లోనూ 350ం స్కోరు నమోదయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ అయిన తరువాత భారత జట్టు రాంచీ వన్డేతో వన్డే సిరీస్‌ను విజయంతో ఆరంభించింది. ఆ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ 52వ సెంచరీతో చెలరేగగా, రోహిత్ శర్మ%–%కేఎల్ రాహుల్ అర్ధశతకాలతో రాణించారు. చివర్లో గైక్వాడ్ దూకుడైన ఇన్నింగ్స్ ఆడినా, ఉత్కంఠభరితంగా సాగిన ఆ పోరులో భారత్ 17 పరుగుల తేడాతో గెలుపొందింది.

# కొణిజేటి రోశయ్య ఆదర్శవంత రాజకీయవేత్త..

- **శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఆదర్శవంత రాజకీయవేత్త.. నేటి రాజకీయ నాయకులకు మార్గదర్శకుడు.. సమయస్ఫూర్తి కలిగిన వ్యక్తి... క్రమశిక్షణకు మారుపేరు రోశయ్య అని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభ తెలంగాణ భాషా సాంస్కృతి శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించారు. శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌తో కలిసి రోశయ్య చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోశయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆలోచన అభినందనీయమన్నారు. రోశయ్య జీవితం భావితరాలకు తెలియజేయాలన్నారు. శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. రోశయ్య ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎమ్మెల్సీగా అనేక పదవులతోపాటు ఆర్థిక శాఖ మంత్రిగా పరిపాలనా దక్షత, ఆర్థిక నిపుణుడిగా మంచి పేరు సంపాదించుకున్నారని తెలిపారు.కొణిజేటి రోశయ్య ఆధునిక భీష్ముడిగా గుర్తింపు పొందారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆయన రాజకీయాలకతీతంగా అనుభవజ్ఞుడిగా, అందరి గౌరవాన్ని పొందిన గొప్ప నాయకుడన్నారు. రోశయ్య వ్యక్తిగతంగా ఎప్పుడూ పదవులు ఆశించలేదని, పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోశయ్య వర్ధంతి సభను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా తనను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ అధ్యక్షులు కాల్వ సుజాత, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు కొణిజేటి శివ సుబ్బారావు, తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ